క్లుప్తంగా

9న ప్రతిభకు సన్మానం

చిత్తూరు రూరల్: వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి ప్రజాహిత సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షులు రాజరత్నంరెడ్డి తెలిపారు. నగరంలోని రెవెన్యూ భవనంలో ఉదయం ప్రారంభమయ్యే కార్యక్రమానికి సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

క్రీడల్లో యువతను ప్రోత్సహించాలి



పైమాఘంలోని క్రీడాకారులకు క్రికెట్ కిట్టును అందజేస్తున్న సుగుణాకర్ రెడ్డి

తవణంపల్లె: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఆడుదాం..ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి స్ఫూర్తితో మండలంలోని పైమాఘం గ్రామానికి చెందిన క్రీడాకారులకు (యువకులకు) క్రికెట్ కిట్ అందజేసినట్లు దాత, అర్ధగిరి ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్, పారిశ్రామికవేత్త పైమాఘం సుగుణాకర్ రెడ్డి తెలిపారు. పైమాఘం ఏబీకే యూత్ క్రికెట్ అసోసియేషన్ క్రీడాకారుల జట్టుకు క్రికెట్టు కిట్ కావాలని కోరడంతో రూ.20 వేలు విలువ చేసే క్రికెట్ కిట్ అందజేసినట్లు వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు ముందుకు వచ్చి తమ ప్రతిభను ఆటల్లో చూపించి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

నేడు వై ఏపీ నీడ్స్ జగన్

ఐరాల: మండలంలోని మొరంపల్లె సచివాలయంలో సోమవారం మధ్యాహ్నం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం వద్ద సభ నిర్వహించనున్నట్లు చెప్పారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కీరమందలో..

బంగారుపాళెం: మండలంలోని కీరమంద గ్రామ సచివాలయంలో సోమవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రామచంద్రారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమం ద్వారా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించనున్నట్లు చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

పంటలను కాపాడుకోవాలి

గంగవరం: బంగాళాఖాతంలో వాయుగుండం తుపానుగా బలపడనున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండి పంటలను కాపాడుకోవాలని పలమనేరు వ్యవసాయ సబ్‌డివిజన్ వ్యవసాయ సూచకులు అన్నపూర్ణాదేవి ఆదివారం ఒక ప్రకటనలో అప్రమత్తం చేశారు. పలమనేరు సబ్ డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లో ప్రస్తుతం 1,610 ఎకరాల్లో వరి, 225 ఎకరాల్లో రాగి పంట, 150 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు కోతకు సిద్ధంగా ఉన్నాయన్నారు. తుపాను ప్రభావంతో పంటలు నష్టపోకుండా ఆర్బీకే సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తూ, తుపాను ప్రభావం తగ్గే వరకూ సిబ్బంది అంతా గ్రామాల్లో పర్యటిస్తూ, రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. అలాగే పంటల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని అధికారులకు చేరవేయాలని ఆదేశించారు.

కార్వేటినగరంలో 95 మి.మీ. వర్షపాతం

కార్వేటినగరం: తుపాను ప్రభావంతో మండలంలో 95 మి.మీ.వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ అధికారిణి హేమలత తెలిపారు. ఆమె ఆదివారం మీడియాతో మాట్లాడుతూ గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో అత్యధిక వర్షపాతం నమోదైందని, పాలసముద్రంలో 55.4 మి.మీ. శ్రీరంగరాజపురంలో 80.6 మి.మీ., వెదురుకుప్పంలో 46.4 మి.మీ., అత్యల్పంగా 37.2 మి.మీ., గంగాధరనెల్లూరు మండలంలో వర్షం పడినట్లు పేర్కొన్నారు. దీంతో నియోజకవర్గంలో పలు చోట్ల చెట్లు విరిగి రోడ్లపై, విద్యుత్ తీగలపై పడటంతో వాహన రాకపోకలకు, విద్యుత్ అంతరాయం కలిగింది. కార్వేటినగరంలోని కృష్ణాపురం జలాశయానికి వంద క్యూసెక్కుల నీరు చేరుతోందని, వర్షాలు ఇలాగే కొనసాగితే ఎగువ నుంచి వచ్చే నీటి మట్టాన్ని బట్టి జలాశయం గేట్లను ఎత్తే అవకాశం ఉంటుందని ఇరిగేషన్ ఏఈ రవీంద్రనాయక్ తెలిపారు. పెనుమూరు మండలం కలవకుంట వద్ద ఉన్న ఎన్టీఆర్ జలాశయానికిఎగువ ప్రాంతాల నుంచి 200 క్యూసెక్కులు నీరు వస్తుండడంతో, ఒక గేటు ఎత్తి నీటిని బయటకు విడుదల చేస్తున్నట్లు ఎన్టీఆర్ జలాశయం ఏఈ తెలిపారు.

నేడు రైతులకు పట్టాల పంపిణీ

కార్వేటినగరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అసైన్డ్ భూములకు పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని గంగాధరనెల్లూరులో సోమవారం చేపట్టనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి ఆనందరెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన 132 మందికి పటాల పంపిణీని జీడీ నెల్లూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

తవణంపల్లెలో కురుస్తున్న జడివాన



బంగారుపాళ్యంలో కురుస్తున్న వర్షం



యాదమరిలో బస్సుకోసం వర్షంలో నిరీక్షిస్తున్న జనం



తుపానుపై అప్రమత్తత అవసరం

చిత్తూరు అర్బన్: తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నగరంలోని లోతట్టు, నీవా నది పరీవాహక ప్రాంతాల్లో నగరపాలక అధికారులు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని నగర కమిషన అరుణ ఆదేశించారు. ఆదివారం ఉదయం కమిషనర్ నగరంలోని లోతట్టు, సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితిని సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రధానంగా నీవా నది పరివాహక ప్రాంతాలైన ఇరువారం, వీరభద్ర కాలనీ, ముత్యాలమ్మ గుడి, రిక్షా కాలనీ, వర్షపు నీటి ప్రవాహాలు అధికంగా ఉండే ఇందిరానగర్, బాబా కాలనీ, శంకరయ్య కుంట, కుమార్ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సమయంలో డ్రైనేజీ బ్లాక్ అయ్యేందుకు అవకాశం ఉన్న ఎంఎస్ఆర్ సర్కిల్, కట్టమంచి మార్కెట్ యార్డు, కొండారెడ్డిపల్లి, ఓటీకేరోడ్ తదితర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి నీరు నిల్వచేరకుండా చూడాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పనులు చేపట్టడానికి వీలుగా అత్యవసర బృందాలను నియమించారు. వీరు వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్వో లోకేష్, డీఈ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

మండలంలో తుపాను ప్రభావం

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో తుపాను ప్రభావం కనిపించింది. బంగాళాఖాతంలో సోమవారం తీరం దాటే అవకాశం ఉందని ఇదివరకే వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు నగర, మండల వ్యాప్తంగా ఇప్పటికే వర్షం కురుస్తోంది. శనివారం మధ్యాహ్నం నుంచే తుపాను ప్రభావం కనిపించింది. ఈ నేపథ్యంలోనే అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు విధిగా విధుల్లో ఉండాలని ఆదేశించారు.



చిత్తూరు: జేసీబీతో కాలువ పూడికలను తీయిస్తున్న కమిషన్ అరుణ

పంటలు జాగ్రత్త

తుపాను నేపథ్యంలో వ్యవసాయశాఖ అధికారులు సైతం అప్రమత్తం అయ్యారు. ఆర్బీకేలోని వ్యవసాయ శాఖ సహాయకుల ద్వారా రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ముఖ్యంగా కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట సత్వరమే హార్వెస్టర్ ఉపయోగించి కోత మొదలుపెట్టేలా చూడాలని ఏడీ మధుసూదన్‌రెడ్డి సిబ్బందికి సూచనలు జారీ చేశారు. వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించి వర్షానికి తడవకుండా చూసుకోవాలన్నారు. మిరప, ఇతరత్రా పంటల్లో వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత తెగుళ్ల నివారణకు మందులు పిచికారీ చేయించాలని ఆయన సిబ్బందికి వివరించారు.

ఎడతెరపిలేని జడివాన

తవణంపల్లె: మండలంలో ఆదివారం తుపాను ప్రభావంతో ఎడతెరపిలేని జడివాన కురిసింది. జనం ఇటి నుంచి బయట వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. మండలంలో 10.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రెవెన్యూశాఖ అప్రమత్తమై తగు హెచ్చరికలు చేశారు. వర్షాలకు పంటలు దెబ్బతినకుండా రైతులు తమ పంటలను కాపాడుకోవాలని వ్యవసాయాధికారి ప్రవీణ్ తెలిపారు. ఎడతెరపి లేని వర్షాలతో పశువులు, గొర్రెలకు మేతలేక ఇబ్బందులు పడుతున్నారు. మట్టిరోడ్లు బురదమయంగా మారాయి.

వర్షంతో జనం ఇక్కట్లు

బంగారుపాళెం: బంగాళాఖాతంలో తుపాన్ ప్రభావంతో ఆదివారం మండలంలో చిరు జల్లులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అప్పుడప్పుడు చిరు జల్లులతో కూడిన వర్షం పడుతుండడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, వివిధ వ్యాపారాలు సాగిస్తున్న చిరు వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. రబీ సీజన్‌లో వరి సాగు చేసే రైతులకు వర్షం అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు.



నిత్యాన్నదానానికి విరాళం

చౌడేపల్లె: శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదానం కార్యక్రమం నిర్వహణకు బెంగళూరు ఎమ్మెల్సీ రామోజీ గౌడ రూ.25వేల విరాళాన్ని ఈఓ చంద్రమౌళికి అందజేశారు. తమ కోర్కెలు ఫలించడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించినట్లు చెప్పారు. తమవంతు విరాళమిచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబ సభ్యులను ఈఓ సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

శాస్త్రోక్తంగా శ్రీకపిలేశ్వర స్వామి రుద్రయాగం



యాగశాలలో కొలువైన శ్రీకామాక్షి దేవి సమేత శ్రీకపిలేశ్వర స్వామివారు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో మూడో రోజైన ఆదివారం రుద్రయాగం శాస్త్రోక్తంగా చేపట్టారు. హోమంలో పాల్గొన్న భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో కార్తీక మాస ధాత్రి హోమాలు

పుంగనూరు: పట్టణంలోని శ్రీహరిహర బ్రాహ్మణ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాస ధాత్రి హోమాలు చేశారు. శంకరాచార్యులు పూజలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రాజశేఖర్ దీక్షితులు, రాజేష్, రామమూర్తి, మధు, రామచంద్రరావు, ఉదయ్‌కుమార్, సుబ్రమణ్యం, బ్రాహ్మణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



గంగాపురంలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బోయకొండ ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి

చౌడేపల్లె: పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద అభివృద్ధి పనులను బోయకొండ ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి పరిశీలించారు. ఆదివారం గంగాపురంలో ఆర్‌అండ్‌బి గెస్టుహౌస్ పనులను పరిశీలించి మాట్లాడారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలను పాటించి నిర్ణీత గడువులోపు పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే బోయకొండలో కోట్లాది రూపాయలతో చేస్తున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. దర్శనం, మౌలిక వసతులపై భక్తుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు రాజేష్, భారతి, వైఎస్సార్ సీపీ నాయకులు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీతోనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పీఎం నరేంద్రమోదీ నాయకత్వంలో అభివృద్ధి ఉంటుందని ప్రజలు నమ్మి ఓటువేసి బీజేపీని గెలిపించారన్నారు.

సేవాలయాలు

- మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేదు
- అన్నిరకాల సర్టిఫికెట్లు సచివాలయాల్లో లభ్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న జనం

యాదమరి: గతంలో ఎలాంటి సర్టిఫికెట్లు అవసరం వచ్చినా మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు పరుగులు తీయాలి. అక్కడ సమయానికి అధికారులు ఉండరు. పదే పదే కాళ్లు అరిగేలా తిరిగితే అప్పుడు పనులు అయ్యేవి. కానీ ఇప్పుడు పరుగులు తీసే రోజులు పోయాయి. కార్యాలయ చుట్టూ చెప్పులరిగేలా తిరిగే బాధలు తప్పాయి. ఏ సమస్యకైనా సచివాలయాలే పరిష్కారం చూపుతూ సేవాలయాలుగా వెలుగొందుతున్నాయి. ప్రభుత్వం నుంచి ఎలాంటి సర్టిఫికెట్లు అయినా నిమిషంలో అందిస్తూ ప్రజల మన్నలు పొందుతున్నాయి. ప్రభుత్వం రాగానే పథకాలు అర్హులందరికీ సులభంగా చేరాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ప్రవేశపెట్టిన సచివాలయాలు అన్ని వర్గాల ప్రశంసలు అందుకుంటున్నాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయ వ్యవస్థలకు శ్రీకారం చుట్టారు. లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించారు. పూతలపట్టు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 98 సచివాలయాలు లేర్పాటు చేశారు. ప్రతి సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించి వారి ద్వారా పాలనను ప్రజల ముంగిటకే చేర్చుతున్నారు. ప్రతి సచివాలయంలో 540 రకాల సేవలు అందిస్తున్నారు. ప్రజలందరూ మండల కార్యాలయాలకు వెళ్లి నెలల తరబడి ప్రదక్షిణలు చేసే పని లేకుండా సచివాలయాలు ఉన్న ఊర్లోనే అవసరమైన సేవలు అందిస్తున్నాయి. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల సమన్వయంతో పనిచేస్తూ ప్రజల ముంగిట్లోకి ప్రభుత్వ పాలనన తీసుకెళుతున్నారు. దళారీ వ్యవస్థ లేకుండా సమస్యలకు సులభంగా పరిష్కారం లభిస్తుండడంతో అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వరదరాజుల పల్లె సచివాలయం

పింఛన్ మంజూరు చేశారు



గతంలోలా పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగలేదు. వలంటీర్ సచివాలయంలో దరఖాస్తు చేయించారు. కొన్ని రోజులకే నాకు వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. పింఛన్ మా కుటుంబానికి ఎంతగానో ఉపయోగపడుతోంది. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

–వరదయ్య, యాదమరి

జగనన్న సురక్షతో సర్టిఫికెట్లు



గతంలో సర్టిఫికెట్లు తీసుకోవాలంటే చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం జగనన్న సీఎం అయ్యాక ఎటువంటి సర్టిఫికెట్ అయిన సచివాలయంలో దరఖాస్తు చేస్తే ఇస్తున్నారు. జగనన్న సురక్ష ద్వారా 11 రకాల సర్టిఫికెట్లు రూపాయి ఖర్చు లేకుండా ఇచ్చారు. జగన్‌కు రుణపడి ఉంటాం.

–లత, అరుణనగర్, ఐరాల

తప్పిన ఆధార్ తిప్పలు



గతంలో ఆధార్ కార్డు కావాలన్నా, అందులో తప్పుఒప్పులు సరిదిద్దుకోవాలన్న మీ సేవ చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ జగనన్న ప్రభుత్వం రాగానే సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆధార్ కార్డు కావాలన్నా, తప్పు ఒప్పులు సరిదిద్దుకోవాలన్నా అర్ధగంటలో పూర్తి అవుతుంది.

–ధనపాల్, మంగళపల్లె

సొంతింటి కల నెరవేరింది



ఎన్నో ప్రభుత్వాలు వచ్చాయి. ఎవ్వరూ మాకు ఇల్లు మంజూరు చేయలేదు. కానీజగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంటి స్థలం కాకుండా ఇల్లు కూడా మంజూరు చేయడంతో ఇల్లు నిర్మించుకుంటున్నా. దీంతో మాకు సొంతింటి కల నెరవేరింది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఫజానా, తగ్గువారిపల్లె

దివ్యాంగ పిల్లలకు రూ.లక్ష ఉపకరణాల పంపిణీ



దివ్యాంగ పిల్లలకు వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు పంపిణీ చేస్తున్న దాతలు, విద్యాశాఖ సిబ్బంది

గంగవరం: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఆదివారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మండల విద్యాశాఖాధికారుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భవిత కేంద్రం వద్ద జాయినింగ్ ద డాట్స్ ఫౌండర్ ధనరాజ్ సహకారంతో దాతలు జీరోధ కంపెనీ ప్రతినిధులు దివ్యాంగ పిల్లల కోసం రూ.లక్ష విలువ చేసే వీల్ చైర్లు, క్రీడా వస్తువులు, ఉయ్యాలలు, వాకర్లు మొదలైన వాటిని వితరణ చేశారు. వాటిని మండల విద్యాశాఖాధికారులు, ఐఈఆర్‌టీ టీచర్లు పంపిణీ చేశారు. వారు మేనరిక వివాహాలు, చిన్న వయసులో పెళ్లిళ్లు చేయడం వలన వైకల్యం, మానసిక సమస్యలతో పిల్లలు జన్మిస్తారని, ఇలా జన్మించిన పిల్లలను పెంపకంలో మరింత శ్రద్ధ, ప్రేమానురాగాలు చూపవలసిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ఒకవేళ పోషణ భారమైతే సమీపంలోని భవిత కేంద్రాల్లో అలాంటి పిల్లలను చేర్పించాలని, వారి బాగోగులను చూసుకునేందుకు ప్రభుత్వం సౌకర్యాలు సమకూర్చిందన్నారు. భవిత కేంద్రంలోని దివ్యాంగ పిల్లల్లో నైపుణ్యాలను, ప్రతిభను వెలికితీయడానికి కృషి చేస్తామని సాహితీ ఉపాధ్యాయురాలు సురేఖ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు వేణుగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు రూప, దేవేంద్ర, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు త్రిలోక్, అశోక్‌కుమార్, సీఆర్‌పీలు రాజన్న, గాయత్రి, జేటీడీ వలంటీర్లు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలమనేరులో..

పలమనేరు పట్టణంలోని విద్యాశాఖ కార్యాలయం భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. జెటిడి సంస్థ సహకారంతో జెరోధ కంపెనీ వారు రూ. 2. 70 లక్షలతో ఉచితంగా అందించిన పరికరాలను ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం కలిసి స్వీకరించారు. ఐఈఆర్‌పి ఉపాధ్యాయులు మంగేశ్వరి 20మంది పిల్లలకు దుస్తులను ఉచితంగా అందించారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

చిత్తూరు అర్బన్: పోలింగ్ కేంద్రాల పరిధిలో యువతను కొత్త ఓటర్లుగా చేర్పించాలని ఏఈఆర్వో, కమిషనర్ అరుణ బీఎల్వోలను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల నమోదు అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం కమిషనర్ తనిఖీ చేశారు. ఇరువారం పరిధిలోని 111, 112 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024 కార్యక్రమాన్ని పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. ఫారం -7 విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అధికారి, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, బీఎల్వోలు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

తవణంపల్లె: మండలంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పూతలపట్టు నియోజకవర్గ ఎలక్ట్రోల్ ప్రత్యేక అధికారి శివయ్య పరిశీలించారు. మండలంలోని 56 పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు నూతన ఓటర్ల నమోదు, మరణించిన, గ్రామం వదలిని, వివాహమైన ఓటర్లను తొలగించుట, సవరణల కోసం క్లైమ్లను ప్రత్యేక క్యాంపు నిర్వహించి స్వీకరించారు. మండలంలోని ఎగువ తడకర, జొన్నగురకల, అరగొండ, పైమాఘం పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియను పరిశీలించారు. పారదర్శకంగా ఓటర్ల నమోదు, ఓటర్ల తొలగింపు, సవరణలు చేపట్టాలని బీఎల్వోలను ఆదేశించారు. మండలంలో నూతన ఓటర్ల నమోదుకు ఫారం 6 క్లైమ్‌లు 98, మరణించిన వారి ఓటర్ల తొలగింపుకు 89 క్లైమ్‌లు, సవరణలకు(మార్పులు, చేర్పులు)64 క్లైమ్లులు వచ్చినట్లు తహసీల్దార్ గుణశేఖర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భూరీసర్వే డిటి వెంకటరమణ, సెక్టోరియల్ అధికారులు, రూట్ ఆఫీసర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.



పూతలపట్టు: పోలింగ్ బూత్‌లో ఓటరు దరఖాస్తులను పరిశీలిస్తున్న ఈఆర్ఓ శివయ్య

ప్రత్యేక ఓటర్ల నమోదుకు నేడు ఆఖరు

యాదమరి: ప్రత్యేక శిబిరంలో ఓటర్లు నమోదుకు సోమవారం ఆఖరు రోజు అని తహసీల్దార్ హనుమంతు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మూడు రోజుల పాటు మండల పరిధిలో ఉన్న ఎన్నికల బూత్‌లోల బీఎల్ఓలు ఉన్నారని తెలిపారు. దీన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యదర్శులు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

తుపాను పట్ల అప్రమత్తంగా ఉండాలి

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తీవ్రవాయుగుండంతో మండల పరిధిలో మోస్తారు వర్షం కురుస్తున్నదన్నారు. తుపాన్ ప్రభావం మూడు రోజుల పాటు ఉంటుందన్నారు. దీనిపై మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, వలంటీర్లు అందరు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ హనుమంతు కోరారు.

ఓటరు నమోదు శిబిరాలకు విశేష స్పందన

పూతలపట్టు: మండలంలో నిర్వహించిన ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరానికి విశేష స్పందన లభించింది. మండలంలోని ఓటరు జాబితాను ప్రజల పరిశీలన కోసం శని, ఆదివారాల్లో పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచారు. యువకులు మార్పులు, చేర్పులు, బదిలీలపై పలువురు దరఖాస్తులను అందించారు. ఈ శిబిరంలో ఫారం-6లు 181, ఫారం -7లు 189, ఫారం-8లు 119 మొత్తం 489 దరఖాస్తులు అందాయి. మండలంలోని పోలింగ్ స్టేషన్లను ఈఆర్ఓ శివయ్య, మండల స్పెషల్ అధికారి జాన్‌విక్టర్, తహసీల్దార్ విజయభాస్కర్, ఈడీటీ మహేశ్వరి, ఆర్ఎస్‌డీటీ మునికృష్ణ పాల్గొన్నారు.







ఓటర్లు నమోదు చేస్తున్న కార్యదర్శి సుకుమార్ రెడ్డి, ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న అధికారి శివయ్య, పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ